# ★ కుక్క తోక ★

కమలాకాంత్

సూర్యుడు సొమ్మసిల్లిన వేళ —

ప్రకృతి కునుకు తీయబోయే వేళ —

ఆ మునిమాపువేళ వీధి తలుపు చప్పుడు విని అనసూయమ్మ ఎవరబ్బా అనుకొన్నది. భర్త రంగనాథం వారంవరకూ రానని చెప్పి మంతెన వారిపాలెం వెళ్లాడు. అప్పుడే ఎందుకు తిరిగి వచ్చారో అనుకుంటూ వెళ్ళి తలుపు తీసి నిశ్చేష్టురాలయింది ఆమె గుమ్మంలో నిలబడ్డ మనిషిని చూచి.

బికారి వెధవ...కాదు...లాంటి సుబ్బులు ... అసలు పేరు సుబ్బారావు ....

సుబ్బిగాడు, సుబ్బులు పెద్దయిన తర్వాత కూడ స్థిరపడిపోయిన చిన్నప్పటి ముద్దు పేర్లు.

చిన్నప్పటి సుబ్బారావు అల్లరికి, చిలిపిచేష్టలకి, ముద్దొచ్చి 'సుబ్బిగాడు' 'సుబ్బులు' అని పిలిచినా, పెద్దయిన తర్వాత మొద్దులాంటి మొహాన్ని చూచి, అవే ముద్దుపేళ్లతో శాపనార్థాలు పెట్టడం పరిపాటయిపోయింది కూడ బంధుప్రపంచంలో.

సుబ్బారావుని చూడ్డంతో ఆ బికారి రూపంలో సాక్షాత్కరించడం రెండోసారైనా, అనసూయమ్మ కళ్లలో కన్నీరు గిర్రున తిరిగింది.

మసక వెలుతురులో సుబ్బారావు ఆ విషయం గ్రహించలేకపోయాడు. లోపలికొస్తూనే సుబ్బారావుకు దుఃఖం పెల్లుబికి రాగా అనసూయమ్మ కాళ్లపై పడిపోయాడు. వచ్చే పరితాపాన్ని బలవంతాన బంధించి, కొంగుతో కన్నీరు తుడుచుకొని సుబ్బారావుని పైకి తీసి 'ఏమిట్రా ... యిలాగైపోయావ్!' అన్నది లోలోపల హృదయం తరుక్కుపోతుంటే ...

ఎలాగైనా స్వంత మేనల్లుడాయె - అనసూయమ్మ అన్న కొడుకు ఆ సుబ్బులు.

'ఏం చేస్తానత్తయ్యా ... నా అదృష్టం యిలా వుంది' సుబ్బారావు వేదాంతధోరణిలో తను చెడిపోవటానికి బలవత్తరమైన కారణం ముఖ్యంగా 'విధి' అని తేల్చాడు.

'ఎక్కడరా ఉండడం. యిప్పుడన్నా కుదురుగా వుంటున్నావా?'

'అవన్నీ తర్వాత చెప్తాలేవే అత్తయ్యా! - మామయ్య, పిల్లలు, ఏరి?,

అనసూయమ్మ గంగనాథం వూళ్లో లేడని చెప్పడానికి కొంత అంజాయించింది.

'పిల్లలు యిక్కడే ఎక్కడో ఆడుతున్నారు. వాసుకు బెజవాడలోనే ఉద్యోగం ... మామయ్య పొలం వెళ్లారు ఏదో పని మీద!

'ఎవరికీ కాకుండాపోయినా నువ్వు మాత్రం ఏమీ అనవుగదటే అత్తయ్యా. అందుకే మిమ్మల్ని చూద్దామని వచ్చాను.'

'వెధవ అన్నీ తెలుసు. తెలిసీ అవ్యక్తం ఆ ఒక్క బుద్ధీ మానితే నిక్షేపంగా బాగుపడేపోదువు'

సుబ్బారావు శుభ్రంగా నిండుగా నవ్వాడు. పిల్లలతో సుబ్బారావు కాలక్షేపం చేస్తుంటే, అనసూయమ్మ వంటింట్లో, ఆలోచనల్లో మునిగిపోయింది.

వంట ప్రతిరోజూ వుండేదే- ప్రత్యేకంగా సుబ్బారావు కోసమేం కాదు.

కాని ఆలోచన మాత్రం సుబ్బారావు గురించే.

ఎదురుగ్గా ఎర్రని మంట కాంతులురి మొహం మీద చిమ్ముతుంటే ఒక్కసారి 'సత్యం' కళ్లకు కట్టినట్లుగా మెదిలి మాయమైపోయాడు.

వంట పనులు యాంత్రికంగా చేస్తూ గతాన్ని పునశ్చరణ చేసుకుంటున్నది అనసూయమ్మ.

◆ ◆ ◆

సత్యం! .... సత్యన్నారాయణ తన స్వయానా అన్న. సుబ్బులు వాడి కుపుత్రుడు. తనకు మేనల్లుడు.

ఆరోజుల్లో తన చిన్నతనంలో కనగాలలో ఉండేవారు అందరూ తను, తన అక్క అన్నపూర్ణ, మంచంలో తీసుకుంటున్న తల్లి ఎన్నడూ రోగం రొష్టూ కూడ ఎరుగని తన తండ్రి, అంతా — సత్యం చాల దూరాన ఎక్కడో కల్యాణిలో స్టేషన్ మాస్టరు.

కనగాలలో లంకంత కొంప. విశాలమైన లోగిలీ. ఆ దేవూళ్లో అయిదెకరాల మాగాణి, తాటితోపులూ, మామిడితోట.

తన తండ్రి సుబ్బయ్య — అయన పేరే సత్యం కొడుక్కి పెట్టుకున్నారు తర్వాత తన తండ్రికిగల విగ్రహపుష్టి తప్ప సుబ్బులుకి మరే గుణమూ అబ్బలేదు. ఆయన కాడిఅంత మనిషి. మంచి బలంగా వుండేవాడు. తన కింకా జ్ఞాపకం. ఆయన రెండు వడ్ల బస్తాలను రెండు చేతులతో అవలీలగా తీసికెళ్ళి బండికెక్కించేవాడు.

స్వంతవ్యవసాయం. సమృద్ధిగా పాడి — రెండు గొడ్డు గేదెలు, మూడు ఒంగోలు ఆవులు వుండేవి కొట్టంలో. పాలు, పెరుగు తమకు సుష్టుగా సరిపోగా, చాలమందికి పందారం జరిగేది. మళ్ళీ ఆరోజులొస్తాయా!. ఆ ప్రేమలున్నాయా? ఆ మనుషులున్నారా? కాలంతోబాటు మనుషులూ, మనసులూ మారుతుంటే గడచినరోజులు చర్విత చర్వణం చేసుకోవడం తప్ప ఏముంటుంది? అసలు ఎప్పుడూ గడచిన రోజులే అందంగా కనిపిస్తయ్ ... మనం చేయని పనుల్ని చేయలేని పనుల్ని ఎత్తిచూపి మన కర్తవ్యాన్ని బోధించేవి కూడా ఎప్పటి కప్పుడు గడచిన రోజులే.

రాతి లాంటి పెరుగు— తోడుపెట్టిన పెరుగు కదిలిస్తే కదిలేదికాదు చాకుతో కోయాల్సి వచ్చేది. ముక్కలుగా జున్ను గడ్డల్లాగా. వూళ్లో వాళ్లందరికీ తన తండ్రింటే ఎనలేని గౌరవం. ఏ సలహాకన్నా, సహాయానికన్నా ఆయన దగ్గరకే వచ్చేవాళ్లు వూళ్లో. తనంటే ఆయనకు వల్లమాలిన ప్రేమ. సత్యం, అన్న పూర్ణల తర్వాత అయిదుగురు సంతానం కలిగి ఒక్కరూ బ్రతికి బట్టకట్టలేదు. తర్వాత తను. అందుకే తనంటే గారాబం చేసేవాడు ఆయన. అనసూయమ్మ నేత్రాలు బాల్యస్మృతులతో తడుక్కున్నై.

సత్యానికి తండ్రి పోలికే వచ్చింది. తండ్రి లాగే బలిష్టుడు మంచి పట్టుదల గల మనిషి. ముక్కుసూటిగా పోయేరకం.

అటువంటివాడికి దేవతలాంటి భార్య దొరికింది. ఎంతో సౌమ్యురాలు. ఆమె తమయింటి కోడలిగా వున్న అయిదేళ్ళలో తనకు నేస్తంగా, ప్రతిరూపంగా ఒక ఆడ పిల్లను వదలి శాశ్వతంగా కనుమరుగైపోయింది. తను దేవతలాంటి వదినగార్ని చూడలేదుగాని, ఆమె మిగిల్చిపోయిన ఆ పసిబిడ్డతోనే పెరిగింది చిన్నప్పటినుండీ. తర్వాత సత్యం కల్యాణిలో వుంటే, పిల్ల తమతోనే వుండేది. దాని పేరు లక్ష్మి. లక్ష్మి, తను, ఒక కంచంలోతిని, ఒక్క మంచంలో పడుకుని, అక్కచెల్లెళ్ళలాగా పెరిగారు. లక్ష్మి తన యీడుదే. తనంటే ఎంతో ప్రాణం దానికి. అది యిప్పుడు హాయిగా తన సంసారం తను పోరు పొచ్చం లేకుండా చక్కదిద్దుకుంటున్నది.

వదినలో మంచితనాన్ని గుర్తించిన అన్నయ్యకు ఆమె పోవడంతో మానసికంగా గట్టి అఘాతమే తగిలింది అయినా అందరి బలవంతం వల్ల మారుమనువు ఒప్పుకోక తప్పిందికాదు వాడికి.

రెండో వదిన రాజేశ్వరి మొదటి ఆవిడకు ఈమెకు సామ్యం ఏమాత్రంలేదు. పూర్తి వ్యతిరేకం. సత్యం కాదన్నది తను అవునని, వాడు చేయమన్నది తను ససేమిరా చెయ్యనని — పూర్తిగా రెట్టమతం. అంతా చండీశాస్త్రం.

అంత ప్రయాసపడి సెలవు పెట్టి కల్యాణి నుండి పనగాల వచ్చేవారు. రెండురోజులలో యిద్దరికీ ఏదో కీచులాట రావడం, సాయంత్రంకల్లా ప్రయాణమై వెళ్ళిపోవడం కూడా జరిగి పోయేది. వచ్చినంత సేపు పట్టేదికాదు. మంచంలో ముసలావిడ వీరి దాంపత్యాభాస చూచి కన్నీరు పెట్టుకుని కుమిలిపోయేది.

సంవత్సరంలో తొమ్మిదినెలలు ఆవిడగారు పుట్టింటికెళ్తే అక్కడ కల్యాణిలో సత్యం పాకశాస్త్రంలో తర్ఫీదు పొందేవాడు.

తన తండ్రి ఒకరోజు పొలంనుండి వస్తుంటే దారిలోనే విపరీతమైన వాన వచ్చింది. ప్రక్కనే పెద్ద గుంటవుంటే దిగి తడవకుండా అలా గట్టుప్రక్కగా నిలబడ్డాడట. వానకి గట్టుతెగి, పెద్ద పెళ్ళవూడి ఆయనమీద పడడం, పక్షవాతం రావడం జరిగింది. వూరి రైతులు అటువైపుగా వస్తూ చూసి 'అయ్యో— సుబ్బయ్య పంతులుగారా!' అని యింటికి తీసుకురావడం — ఆ పక్షవాతంతోనే తీసుకుని సంవత్సరం తిరక్కుండానే చెట్టంత మనిషి గల్లంతు కావడం జరిగింది. యిహ మంచంలో తల్లి మంచంలోనే మిగిలింది. మంచంలో రోగంతో బాధ పడ్తూనే తనదీ, తన అక్క అన్నపూర్ణదీ పెళ్ళిళ్ళుచేసింది.

రాజేశ్వరిదీ, సత్యానిదీ దారి ఎప్పుడూ కలిసేది కాదు. ఉడ్డెమంటే, తెడ్డెం. ఎప్పుడూ, ఏదోరభస జరుగాల్సిందే. మొదట ఆవిడ సౌమ్యురాలు కాబట్టి వీధి కెక్కకుండా సంసారం చేసిందికాని, రాజేశ్వరమ్మ మొండితనం వల్ల సత్యంకూడా పేట్రేగి పోయేవాడు. చేతిలో ఏదివుంటే దానితో కొట్టేవాడు.

రాజేశ్వరికి మొదటి సంతానం ఆడపిల్ల తర్వాత సుబ్బారావు, రంగడు. ఆడపిల్ల సావిత్రి సౌమ్యురాలు, దానికీ పెళ్ళైపోయి సంసారం అది గుట్టుగా వెళ్ళదీసుకుంటున్నది. యిహ సుబ్బులు, రంగడు యిద్దరూ తల్లి పెంపకంలో పెరిగారు కావాలని చెడ్డపనులు నేర్పుతుంటే అది పెంపకం ఎలా అవుతుంది పెంకితనం కంటే దానిని తర్ఫీదు అనాలి. ఆవిడగారు సంవత్సరంలో తొమ్మిది నెలలు పుట్టింట్లో వుండడంతో పిల్లలచదువు సవ్యంగా సాగేదికాదు. నానాకాలం చదువు అయింది. చదువు రాకపోయినా సరే వాళ్ళని మాత్రం సత్యం దగ్గర వుంచక తనతోటే వాళ్ళని యిటూ అటూ అమ్మగారింట్లో తిప్పుతుండేది. చివరికి వాళ్ళిద్దర్నీ వాడికి కాకుండా చేసింది.

రాజేశ్వరి మొండితనానికి గుర్తుగా ఒక సంఘటన తనకింకా బాగా జ్ఞాపకంవున్నది. మరి పెద్ద పెద్ద విషయాలేవీ కావు. అసలు వచ్చినదల్లా వంటకాలలో పప్పు పులుసు దగ్గర వచ్చింది. సత్యం, కందిపప్పు వేసి పులుసు పెట్టమన్నాడు. 'ఏం, పెసరపప్పు అయితే దిగదా ఏం?!' అన్నదామె పిల్లిని కసిరినట్లు.

సత్యం 'మాట్లాడకుండా చెప్పినట్లు చేయమన్నాడు' తర్వాత బజారుకెళ్ళి మధ్యాహ్నానికి తిరిగి వచ్చాడు. ఎండలో తిరిగి సలసల లాడుతున్నాడేమో, చికాకుగా వున్నాడు.

భోజనానికి కూర్చున్నాడు. ప్రక్కనే కుంపటిమీద పులుసు మరుగుతున్నది సత్యం భోజనం చేస్తూ పులుసు పెసరపప్పుదని గ్రహించాడు. రాజేశ్వరమ్మ వాడు ఏది వద్దన్నాడో అదే చేసింది పెడసరంగా. సత్యం రౌద్రం దాల్చాడు. ప్రక్కనే వున్న యినప గరిటె విసిరేసాడు ఆమె మీదకి. యింకా కోపం ఆగక పక్కనే కుంపటి పైన మరుగుతున్న పులుసు తీసికెళ్ళి సలసలా కాగేది కాస్తా ఆమె నెత్తిమీద కుమరించాడు. ఆమె లబో దిబో.

సత్యం ఖరాఖండీ మనిషి. తను వున్నట్లు అందర్నీ వుండమంటాడు. తన అన్నగారు చేసిన మరోపని జ్ఞాపకం వచ్చేసరికి అనసూయమ్మ లోలోపలే నవ్వుకున్నది.

ఎందుకో తనూ వాళ్ళింట్లోనే వుండడం తటస్థపడ్డది. సెలవుల్లో వాడు బెజవాడ వచ్చాడు. ఆసనీ పాలనీ తొమ్మిదింటికి యింటికి జేరి భోజనంచేసి పడుకున్నాడు అరు బయట సత్యం అప్పుడే.

వీధి అంతా నిశ్శబ్దంగా వున్నది గాని ప్రక్క యింటిలో నుండి మాత్రం ఒకటే మాటలు, గల్లంతు; నవ్వులు అరుపులు. వారింటికి ఎవరో చుట్టాలు వచ్చారట. అదీ హడావుడి. పన్నెండు కావస్తున్నది కాని ఆగోలకు హద్దూ పద్దూ, ఆపడం లేకుండా పోయింది. గోలకు వీడికి నిద్ర రాక కంపరమెత్తింది చూసి చూసి చివరికి మధ్యగోడ దగ్గరకెళ్ళి ఆయింటి

(తరువాయి 17 వ పేజీ)

## ★ కుక్క తోక ★

(12 వ పేజీ తరువాయి

ఆసామిని కేకేసాడు. వారింటికీ వీరింటికీ మధ్య, భుజాలవరకు వచ్చే సిమెంటు రాళ్ళ గోడ వున్నగి అయన వచ్చాడు.

సత్యం, కాస్త మాటలుతగ్గించమని మామూలుగా చెప్పాడు. అసలే సత్యం అంటే అందరికీ అదోరకమైన చులకన – లోకువగూను

ముక్కుకు సూటిగా పోయే మనుష్యు మాస్తే అందరికీ అంతేనేమో!.... 'మాయింట్లో మేమేదైనా చేస్తాం. మీరెవరండీ మధ్య'... అనటానికి అనేశారు మొహంమీదే

వీడు యిహ వంటింట్లోకి వెళ్ళి ఒక ఖాళీ కిరసనాయులు డబ్బా, ఒక అప్పడాల కర్ర తీసుకుని గోడవారగా నిలబడి రణభేరి మోగించడం మొదలుపెట్టాడు.

కర్ణకఠోరమైన ఆ డప్పుకు తట్టుకోలేక ప్రక్కయింటి వారంతా పోలోమంటూ గోడ దగ్గర మూగేశారు.

ఏమిటయ్యా యిది?' అంటే ...

'ముందు నోరు ముయ్యండయ్యా!' అని 'అడగటానికి మీరెవరయ్యా... నాయింట్లో నేనేం చేస్తే మీకేం. మీ గొడవ మీరు చూచుకోండి'. అని కసిరి పంపేశాడు.

ఆ యింట్లో ఆ రాత్రి కాదుగదా... వాడు బెజవాడ నుండి కల్యాణికి తిరిగి వెళ్లేవరకూ రాత్రిపూట సంతృప్తిగా నోరెత్తి మాట్లాడితే ఒట్టు.

మర్నాడు ఆ బజారు బజారు, సత్యాన్ని 'జూ' లో జంతువును చూసినట్లు వింతగా చూడ్డమేట. వెనుక నుండి సకిలింతలు–ఎవరో వెనుకనుండి 'డబ్బారాయుడు' అని పేరుకూడ పెట్టారట. అదీ సత్యమే చెప్పి గొప్పగా నవ్వుకున్నాడు. చిన్నప్పుడు ముద్దుగా గారాబంగా పెరిగిన సుబ్బులు, సత్యం చెప్పినమాట వినక తల్లి ప్రోత్సాహంతో అల్లరి చిల్లరగా తిరిగాడు. చిల్లర డబ్బులు లేకపోతే సత్యం జేబులో నుండి సుబ్బులుచేత దొంగతనంగా డబ్బులు తీయిస్తుండేది, సత్యం కనుమరుగైనప్పుడల్లా.

చివరికి చిన్న చిన్న దొంగతనాలు కాస్తా ముదిరి పాకానికి వచ్చినై. ఎలాగైతేనేం సుబ్బులు చేయివాటు తనంలో తర్ఫీదు తల్లి రాజేశ్వరమ్మే యిచ్చింది.

బంధువర్గంలో సుబ్బులు పేరు 'దొంగ చచ్చినాడు' గా స్థిరపడి పోయింది. వాడంటే అందరికీ భయమే. వాడెవరింటికైనా వెళ్తే వరండాలోనే కూర్చోబెట్టి మర్యాద చేస్తారు– మొహమాటం కొద్దీ లోపలికి రానిచ్చినా వాళ్ల కళ్ళన్నీ వీడిమీదే వుంటయ్, వీడు వదలి వెళ్లేవరకూ.

ఎందుకోగాని అంత గట్టి మనిషి సత్యం కొడుకున్నీ పెళ్లాన్నీ అదుపులోకి తేలేకపోయాడు. రోజులు గడుస్తున్న కొద్దీ సుబ్బులు చదువు సన్నగిలి దొంగతనంలో ఆరితేరాడు.

ఆరోజు తనకు బాగా గుర్తున్నది లక్ష్మి పెళ్లి రోజు. పెళ్లి తన తల్లే స్వయంగా చేయించింది కనకగాలలోనే.

అందరూ వచ్చారు. పెళ్లి సలక్షణంగా జరిగింది. ఆరోజు అన్నపూర్ణ రెండు జతల బంగారు గాజులు తీసి బీరువాలో పెట్టి ఏదో పనిమీద దొడ్లోకి వెళ్లింది. పని పూర్తయి తిరిగా వచ్చి బీరువా, తెరిచేటప్పటికి గాజులు గల్లంతు. వాటితోబాటు సుబ్బులు కూడ గల్లంతే. ఆ రాత్రంతా ఎక్కడో తిరిగి, మర్నాటి మధ్యాహ్నానికి యింటికి చేరాడు. నానా గొడవ జరిగింది. సత్యం యిష్టం వచ్చినట్లు చితకతన్నాడు. చివరికి సుబ్బులు ఎలాగో ఒప్పుకున్నాడు. ఒక్క రాత్రిలో గాజులు అమ్మడం, డబ్బు హారించుకుపోవడం కూడ జరిగింది. వారం తిరగకుండానే అన్నపూర్ణకి గాజులు చేయించి యిచ్చాడు సత్యం. అంత నిజాయితీ మనిషి వాడు. అయినా సుబ్బులు మాత్రం అబుద్ధి మానలేదు. చదువు ఫోర్తు ఫారంతో ఆగిపోయింది. పాడు బుద్ధులు అబ్బినంత వేగంగా చదువెలా అబ్బుతుంది!

బెజవాడకు దగ్గరగా వుంటుందని గంగినేనికి బదిలీ చేయించుకున్నాడు సత్యం. వాడ్ని చూడటానికి ఎవరో పాత స్నేహితుడు నైవేలినుండి వచ్చాడు ఒకసారి పిల్లా జెల్లాతో సహా. నైవేలిలో యింట్లో ఎవరూ లేరని సుబ్బులు పసిగట్టి భోజనాలవుతుండగా, ఆ స్నేహితుని కోటుజేబులోని తాళంచెవులగుత్తి కొట్టేశాడు. వాడికి రైలు ప్రయాణం ప్రయాస, ఖర్చులేని హాబీ. టి. సి. కళ్లు గప్పడంలో అందెవేసిన చేయి. ఇంజన్‌లో బొగ్గు వేస్తానంటే డ్రైవర్, వాడి రొట్టె పెట్టి మరీ తనతో తీసికెళ్తాడట. యిలాంటి సుళువులు చాలా చాల తెలుసును వాడికి.

నైవేలి చేరి ఆ పెద్దమనిషి యింటి సామానంతా పరమేశ్వరార్పణం చేశాడు. ఆ స్నేహితుడు జేబు తడుముకుంటే తాళపుచెవుల గుత్తి లేదు. చీకటి పడినా సుబ్బులు లేడు. తాళాల గల్లంతుకి, సుబ్బులు రాకపోవడానికి గల అవినాభావ సంబంధం గుర్తించారు యింటిల్లిపాది. సత్యానికి రాజేశ్వరికి పోట్లాట జరిగిందికూడ ఆ విషయంలో. సత్యం న్యాయకోలేదు. పోలీసు రిపోర్టు యిచ్చాడు. సుబ్బుల్ని పట్టుకున్నా సామాను లేదు సరికదా వాటి తాలూకు డబ్బు కూడ దొరకలేదు. సత్యం స్నేహితుని క్షమాపణ అని సుబ్బులుకి శిక్ష ఏమీ పడలేదు.

తర్వాత కొన్నాళ్లు సుబ్బుల్ని సత్యం యింటికి రానీయలేదు. అయినా సత్యం యింట్లో లేని వేళల్లో తల్లిదగ్గరకు వచ్చి వెళ్లేవాడు సుబ్బులు.

మొదటినుండీ సుబ్బులు పనులకు ప్రోత్సాహం యిస్తూ వచ్చినదే ఆమె. చిన్న దొంగతనాలు వదలి పెద్దవాటిలోకి దిగినా, సుబ్బుని పనులకు గర్హించడం మాని, పోలీసు రిపోర్టు యిచ్చినందుకు సత్యాన్ని నానా మాటలు అన్నదామె. ఆమె పోరు పడలేకనే యిహ సుబ్బైనా కుదురుగా వుండేట్లయితే యింటికి రానిస్తానన్నాడు సత్యం. ఆ పద్ధతి ప్రకారమే సుబ్బులు మళ్లీ గృహప్రవేశం చేసాడు.

కొన్నాళ్లు ఎట్టి పోరాముల్లు లేకుండా గడిచిపోయినై. సత్యం సావిత్రి పెళ్ళిచేశాడు. పెళ్ళి హడావుడి, మేళతాళాలు, సుబ్బులి నిద్రాణమైన శక్తిని మరల ప్రేరేపించినై. తిరిగి బుద్ధావతారంలో నుండి అసలు సుబ్బావతారం బయటపడింది. సావిత్రికి పెళ్ళికి చేయించిన వెయిరూపాయల రాళ్ళ నెక్లెసు ముఖమల్ నరుపు పెట్టెతో సహా మాయమైంది. అంటే పెట్టె ఒక్కటే మాయమయిందనా? కర్త అయినా సుబ్బారావు కూడ అంజనం రాచుకుని అదృశ్యమైనట్లు మటుమాయ మయ్యాడు. వాడయితే అవలీలగా కొట్టేశాడు గాని వాడు నటు మాయమైన తర్వాత పెళ్ళిలో జరిగిన గలభా, సత్యం తొక్కిన చిందులు, రాజేశ్వరిని చెడా మడా తిట్టడం, కొట్టడం - అబ్బ! చెప్పనలవి కాని రాద్ధాంతం. తిని కూర్చుంటే రాసులే తరిగిపోతుంటయ్. నెక్లెస్ వేయి రూపాయలను ఆరు నెలలు తిరక్కుండానే, అగస్త్యుడిలా పుక్కిలించి పారేశాడు సుబ్బారావు.

మరల రాజీ మొదలు - రాజీకి రాజేశ్వరి పోరు నాంది అన్నమాట.

సత్యం ఎంత కఠినో అంతా మార్దవం కల వాడు. కాళ్లా వేళ్లా పడితే కరిగిపోతాడు. ఎంతపట్టుగా వుందామనుకున్నా వుండలేక పోయాడు సత్యం యీసారికూడ. సుబ్బులు తల్లి అండన జేరాడు. కాని యీసారి సుబ్బులుకి, సత్యానికి చాలవరకు ముభావంగా గడచినదనే చెప్పాలి.

సుబ్బారావు జాతకమదేమోగాని, ఏదో అదృశ్యశక్తి వాడి చోరకళ అభివృద్ధికై ఏవో క్రొత్త క్రొత్త అవకాశాలను సృష్టిస్తూనే వుంది. సుబ్బారావు అలా అనుకోకుండా అందిన అవకాశాలను సునాయాసంగా "సొమ్ము" చేసుకుంటూనే వున్నాడు.

సత్యం రిటైర్ కావడం సుబ్బారావుకు జీవితంలో లభించిన చాల అవకాశాలలో ఒకటి.

సత్యానికి ప్రభుత్వం వారిచ్చిన కొంత సొమ్ము నాలుగువేల పైచిలుకు వచ్చింది. ఎప్పటికప్పుడు సుబ్బులు బుద్ధిచెప్తూనే వున్నా సుబ్బులుమీద అంత నమ్మకం ఎలా కుదిరిందో గాని సత్యం డబ్బు పెట్టెలో పెట్టాడు. అందులో సగం, చిన్నప్పుడు చిల్లర డబ్బులు కొట్టేసినంత తేలికగాను కొట్టేసి మరి తిరిగి చూడకుండా, జాడలేకుండా వెళ్ళిపోయాడు సుబ్బులు.

యింత పెద్ద మొత్తం పోయేసరికి సత్యం వెర్రెత్తిపోయాడు. కాని సుబ్బులు అజాపజా వుంటేగా? తర్వాత వాణ్ణి యింటికి రానీయ కూడదని ధృఢంగా నిశ్చయించుకున్నాడు సత్యం.

రెండు వేల సొమ్ముతో పారిపోయిన సుబ్బులు, పుట్టిన తర్వాత ఒక మంచిపనికూడ చేయని సుబ్బులు, పుట్టినదాది తోటకూర దొంగతనం మొదలుకొని అంచెలంచెలుగా 'ఆకలి' అగ్రతాంబూలం స్వీకరించిన సుబ్బులు, రెండు వేల దొంగతనం తర్వాత, ఒక మంచి పని చేసాడు

ఒక ఆడకూతురి తండ్రికి పెళ్ళితంటాలు లేకుండా ప్రేమించి, పెళ్ళిచేసుకున్నాడట. పెళ్ళిచేసుకొనిన తర్వాత ఆ రెండు వేలు హరించుకు పోయే తరుణంలో సత్యానికి యస్. ఓ యస్ మెసేజ్ ఒకటి పారేశాడు. సత్యం కిమ్మన్నాస్తి.

యిహ ఎలాంటి సంబంధమూ వాడితో పెట్టుకోకూడదని గట్టిగా నిర్ణయించుకోవడమే దానికి కారణం. యీసారి రాజేశ్వరమ్మ మధ్యవర్తిత్వానికికూడ పటుత్వం తగ్గిపోయింది.

ఆటు తర్వాత సుబ్బులు జాడ బంధు ప్రపంచానికి కొన్నాళ్లవరకూ తెలియలేదు. కొన్ని సంవత్సరాల అజ్ఞాతవాసం తర్వాత అకస్మాత్తుగా యించుమించు బికారి రూపంలో రంగనాథం అనసూయమ్మల గృహాన్ని పావనం చేశాడు సుబ్బులు.

◆ ◆ ◆

రెండువేల రూపాయలు స్వాహా చేసి ధనార్జన లేని సుబ్బారావుకి, దయతో ప్రేమ భిక్ష పెట్టి ఒక బీదకన్నె కన్నెచెర విడగొట్టిన సుబ్బులుకి, గృహస్థుడై యిద్దరు నలుగురైన సుబ్బులుకి కుటుంబం గడవడం కష్టంగా వుందిట.

రెండువేల నిషాలో మత్తుగా పడివున్న అత్తమామలు ఏనా వదలడంతో, సుబ్బారావుతో రభస మొదలెట్టారు. సుబ్బారావుకి వుద్యోగం కావాలి. ప్రస్తుతం సుబ్బారావు సమస్య యిది.

ఇక పాత బుద్ధులకు మంగళం పాడేశాననీ యిక కుదురుగా వుంటానని, ఎన్నో వాగ్దానాలు కురిపించాడు సుబ్బులు. అనసూయమ్మ సంబరానికి అంతూ పొంతూ లేదు; కొన్ని సంవత్సరాల తరబడి చెడిపోయినవాళ్లు అప్రయోజకుల, లెక్కలోనున్న సుబ్బులు అదీ తన మేనల్లుడు యిన్నాళ్ళకి తనవల్ల బాగుపడబోతున్నందుకు

సుబ్బారావు వుద్యోగానికి రంగనాథం ప్రయత్నాల మీద ప్రయత్నాలు చేస్తున్నాడు. అందులో అనసూయమ్మ శ్రద్ధ ఎక్కువైంది.

పెళ్లాం పిల్లల్ని తీసుకురావడానికి, అక్కడికి సుబ్బులు చేసిన చిల్లర అప్పులు తీర్చడాని (సుబ్బులు ఉవాచ), రెండువందల రూపాయలు కూడ యివ్వాల్సి వచ్చింది రంగనాథం గారికి 'ఉద్యోగం దొరికితే వెంటనే కాస్త కాస్త చొప్పునయినా తీరుస్తాడులెండి మన ఋణం ఏమీ వుంచుకోడు వాడు.' అన్నది అనసూయమ్మ రంగనాథంగారితో.

'తీర్చకపోయినా సరే వాడు నిలకడగా వుంటే అంతే చాలు' అనికూడ సరిదిద్దుకున్నది. అసలు ఆ వేళ సుబ్బులు తీసుకొస్తాడో లేదో అనే అనుమానంతో. మూడో నాటికి అంతా దిగారు. సుబ్బులు పెళ్లాం సంసారపక్షంగానే వుంది. అనాకారి కాదు. ఇద్దరూ మొగ పిల్లలే. ఒకడు ఆరేళ్ల వాడు. యింకొకడు నాలుగేళ్లవాడు. అనసూయమ్మ సంతోషంతో రంగనాథంగారికి ఎన్నో పురమాయించింది. అందరికీ కొత్త బట్టలు కుట్టించి; పిండివంటలు చెసి, ఎన్నో మర్యాదలు చేసింది. యీ సంగతి సత్యానికి తెలియకుండా గుప్తంగా వుంచి, ఒక్కసారే తెలిసేలా చేసి ఆశ్చర్యంలో ముంచి వేయాలని ఆవిడ ఉద్దేశ్యం.

◆ ◆ ◆

ఎలాగైతేనేం సుబ్బులు గ్రహబలమో, రంగనాథం ప్రయత్న బలమో కాని, పక్షం తిరగకుండా తెనాలిలో రంగనాథం తెలిసినవారి ఫర్మ్‌లో సుబ్బులుకి గుమాస్తాగిరీ లభించింది.

అనసూయమ్మ ఆనందం ఆర్ణవమే అవగా, ఆమె ఆనందార్ణవ తరంగాల ధాటికి సుబ్బులు, పిల్లలూ, మిసెస్ సుబ్బులూ వుక్కిరి బిక్కిరయ్యారు. కొంత డబ్బుతో, కొత్త వుడుపులతో సంసారారంభానికి కొంత చెంబూ, తప్పాలా సామగ్రితో తెనాలి సాగనంపింది వారిని.

◆ ◆ ◆

సుబ్బులు దొంగతనం ప్రధాన వృత్తిగా వదలి లోకుల దృష్టిలో దొరతనంలాంటి గుమాస్తాగిరీ చేపట్టాడు. ఆనందంతో బాటు ఆత్రంకూడా ఎక్కువైంది అనసూయమ్మకు యీ విషయం సత్యానికి తెలిస్తే ఎంత సంతోషిస్తాడో కదా అని –

కాని ఎందుకో సత్యానికి ఆ విషయం తెలియకుండానే మూడు నెలలు గడచిపోయినయ్. పండగ ముందు రోజులు. సంవత్సరాది రెండు రోజులు వున్నది యింకా.

◆ ◆ ◆

'పాపం సుబ్బులు వాళ్లు తిసుకుని రండి యిక్కడకి. ఒక్కళ్లే ఎక్కు బిక్కు మంటూ ఎలా వుంటారు? ఒక సరదా, సంతోషం లేకుండా, నాలుగు రోజులుండి వెళ్తారు' అని రంగనాథాన్ని తెనాలి పంపింది ఆమె.

బెజవాడ నుండి వాసు వచ్చాడు. తెల్లారితే పండుగ. ప్రొద్దుననగా తెనాలి వెళ్లాడు రంగనాథం. సాయంత్రమయింది. ఆయన రాకకోసం వేయి కళ్లతో నిరీక్షిస్తున్నది అనసూయమ్మ.

వాళ్లు రావాలి. యిల్లంతా సందడి సుబ్బులు కళ్లలో కృతజ్ఞతా పూర్వకమైన చూపులు !!

'పనంటే వాడికి ఎప్పుడూ అభిమానమే. పాపం వాడికి చిన్నప్పటినుంచి అగచాట్లే. పెంపకం బాగులేక గానీ, తనదగ్గరే గనుక వుంటే మెరికలాంటి వాడ్ని చేసేది' అనుకుంటున్నది ఆమె ... ఆ ఆలోచనల్లో.

◆ ◆ ◆

సూర్యుడు ఎడా తెరిపీలేని ప్రయాణంలో నీరసించి అలసి కుంకుమలలో విశ్రాంతికై వొరిగిపోతుంటే, రైలు ప్రయాణంలో రంగనాథం అలిసి సొలిసి కాళ్ళీడ్చుకుంటూ ఉత్తరీయం దులిపి భుజాన వేసుకొంటూ గుమ్మంలో అడుగు పెట్టారు.

'అదుగో రానేవచ్చారు. యిప్పుడే అనుకుంటున్నా — మీ కందరికీ నూరేళ్ళ ఆయుస్సరా్రి — అనుకొంటుండగానే వచ్చారు-'

'... ... ...'

'అరె... ఏరండీ సుబ్బులు వాళ్ళు?'

'మాట్లాడరేం ... బెజవాడగానీ వెళ్ళలేదు గదా'

'ముందు కాసిని చల్లటి నీళ్లియ్యి...గొంతు ఆర్చుకుపోతున్నది. తర్వాత తీరిగ్గా చెప్తా...'

'అబ్బ! చెప్పరాదుటండీ మంచినీళ్లైనా గాని మీరు చెప్పందే' అంటూనే ఆమె కంచు చెంబుతో చల్లటి నీళ్ళు తెచ్చి యిచ్చింది.

గటగటా తాగి వుత్తరీయంతో స్వేద బిందువులు తుడుచుకుంటూ ....

'మేనల్లుడు బుద్ధావతారాన్ని చాలించి తన పూర్వాశ్రమం స్వీకరించాడు' అన్నారు నవ్వు తెచ్చుకుంటూ

'అబ్బ ... మీహాస్యం చాలించి వివరంగా చెబుదురూ యిక్కడ ఒకవైపు జనం ఆత్రంతో యిదవుతున్నా మీ హాస్యం మాత్రం మానరు!'

'ఏముంది. యింటికి వెళ్తే యిల్లుగల వాళ్లు, తాళం వేసి 'అద్దెకు యివ్వబడును' బోర్డు పెట్టారు. విల్లున్న భాగానికి. తీరా యిల్లు మారారేమోనని అడిగి చూద్దును గదా అసలు సంగతి బయటపడింది.

ఒకరోజు ప్రొద్దున పగలు పదిగంటలయినా యింట్లో పిల్లలు, సందడీలేకపోగా యింటివాళ్లు యిటు తొంగి చూచారట. ఏముంది, తలుపులు బార్లా తెరచి వున్నై. వాళ్ళు ఒకటే గోల.

ఆఫీసులో పండుగ అడ్వాన్సు తీసికొని, తోటి గుమాస్తాల దగ్గర తలా అయిదూ పదీ అప్పులు చేసి, సామానుతో సహా, యింటి అద్దె ఎగవేసి రాత్రికి రాత్రి పరారి అయ్యాడుట సుబ్బులు.

ప్రస్తుతం వాడు ఏసీమలో వున్నాడో, ఏ అవతారం దాల్చాడో ఆ పెరుమాళ్ళకే ఎరుక యిది మేనల్లుడి నిర్వాకం. మీ అన్నయ్యకు గొప్పగా చెప్పావు కాదు. యిప్పుడు చివాట్లు తినాల్సి వచ్చేది. నవ్వుల పాలు అయేవాళ్ళం అయినా ...'

యింకా ఏదో చెప్తూకు పోతున్న రంగనాథాన్ని గుడ్లప్పగించి చూస్తూ స్థాణువులా నిలబడిపోయింది అనసూయమ్మ ...

# జోహార్!

జోహార్, జోహార్, జోహారు
జోహారు నీకిదియె జవహారు
భరత దేశపు నీతి
బావుటా నెగురేసి
ఇతర జాతికి నీవు
నిలచేవు మనోమోహు ||జోహారు||

శాంతి దూతవు నీవు
స్నేహమూర్తివి నీవు
సత్యమూర్తిగ నిలచి
జేజేలు పొందేవు ||జోహారు||

బాలలంటే నీకు
పంచ ప్రాణాలు
వారిమాటలె నీకు
శిరోధార్యమ్ములు ||జోహారు||

వీలు చిక్కిన వాడు
వలపు కురిపించుచు
ఆడేవు పాపలతో
ఈ జగము మరచేవు ||జోహారు||

మంచితనమున నీవు
మణిపూసవై నిలచి
భరత ఖ్యాతిని నీవు
యినుమడించావు ||జోహారు||

ఏ దేశ మేగినా—ఎందు గాలిడినా
భరత ఖ్యాతిని నీవు—భరతజాతిని నీవు
దశదిశల వెదజల్లి—ధరణిలో నిలిచావు
ధర్మమును కాచావు – ప్రేమలను
పెంచావు

జోహారు, జోహారు జోహారు
జోహారు నీదియె జవహారు
జోహారు నీదియె జవహారు

—వి. రామకృష్ణప్రసాద్